సాక్షి సూర్యాపేట

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



తమ్ముడి మామే సూత్రధారి
నల్లగొండలో సంచలనం సృష్టించిన కలర్‌ల్యాబ్ యజమాని సురేష్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. - 8లో



ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది
కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 8లో



కుక్కను తప్పించబోయి..
కోటపహాడ్ గ్రామంలో మహిళా కూలీలతో వెళ్తున్న ఆటో కుక్కను తప్పించబోయి బోల్తాపడింది. - 8లో

న్యూస్‌రీల్

పోలీస్ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి



పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

పెన్‌పహాడ్: పోలీస్ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని ఎస్పీ నర్సింహ సూచించారు. బుధవారం పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పరికరాలు, వివిధ రకాల నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, ఫిర్యాదుల నమోదు, ప్రాథమిక దర్యాప్తు తదితర అంశాలను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డయల్ 100ఫిర్యాదులు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై త్వరగా స్పందించాలని ఆదేశించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ఠంగా పని చేయాలన్నారు. గ్రామ పోలీసు అధికారి వ్యవస్థను ప్రణాళికతో అమలు చేయాలన్నారు. రోజూ గ్రామాలను సందర్శించి ప్రజలకు సన్నిహితంగా ఉంటూ పోలీసు సేవలను అందించాలన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేయాలన్నారు. గంజాయి రవాణా కేసుల్లో ఉన్న నిందితులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి వారి కదలికలను నమోదు చేయాలన్నారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని, సామాజిక అంశాలను వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులు పెంచాలి

అర్వపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకున్నవారికి పథకాలు వర్తిస్తాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటా చలం పేర్కొన్నారు.అర్వపల్లి పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా గర్భిణులను వైద్య సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండల దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్‌నాయక్, సీహెచ్‌ఓ ఎం. బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ అధికారిణి సునిత, కొమారి శైలజ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు మారుడి శ్రీనివాస్‌రెడ్డి



ప్రధాన కార్యదర్శి జెట్టి ప్రసాద్

హుజూర్‌నగర్ : భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) సూర్యాపేట జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపాలెం మండలం దొండపాడులో జరిగిన మహాసభలో మంగళ వారం రాత్రి పొద్దు పోయిన తర్వాత జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మేకల శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా మారుడి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జెట్టి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా షేక్ హుస్సేన్, విద్యాచారి, సహాయ కార్యదర్శిగా యడవెల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సారెడ్డి రాఘవరెడ్డిలతో పాటు మరో 23 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

న్యాయవాదిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణానికి చెందిన న్యాయవాది మంతాపురం కిషోర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదులు వసంత సత్యనారాయణపిళ్లై, బాణాల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జీజీహెచ్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. కిశోర్‌కు చెందిన భూమి గాంధీనగర్‌లో ఉంది. తన భూమి వద్ద సర్వే చేస్తున్నారని తెలుసుకుని ఆయన వెళ్లారు. అక్కడే ఉన్న బుచ్చిరాములు, కొందరు వ్యక్తులు కలిసి కిశోర్‌పై దాడి చేశారని, దాడులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. సమావేశంలో అడ్వకేట్లు మాంద్ర మల్లయ్య, వీరేష్‌నాయక్, అబ్దుల్ లతీఫ్, కంచర్ల సతీష్, యాదగిరి, సందీప్, రాధాకృష్ణ, చంద్రకాంత్ ఉన్నారు.

● ధాన్యం తడిసె



చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో కురిసిన వర్షానికి ఐకేపీ సెంటర్‌లో తడిసిన ధాన్యం బస్తాలు -చివ్వెంల

పెరుగుతున్న మూసీ నీటిమట్టం

కేతేపల్లి: జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది యాసంగి సీజన్‌కు ఆయకట్టులో పంటల సాగుకు నీటి విడుదల నిలిపివేసే నాటిని రిజర్వాయర్‌లో నీటిమట్టం 622 అడుగులకు (గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు) తగ్గిపోయింది. అయితే వారం రోజుల నుంచి హైదరాబాద్ నగరంతోపాటు మూసీ ఎగువ, పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు మూసీలోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. బుధవారం మూసీకి ఎగువ నుంచి 281.36 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం వారం రోజుల వ్యవధిలో ఐదు అడుగులు పెరిగి బుధవారం సాయంత్రానికి 627.10 అడుగులకు చేరుకుంది. 4.46 టీఎంసీల గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.05 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.



రేషన్‌కార్డు మాకెప్పుడు!

జిల్లాలో 1,03,798 మంది దరఖాస్తుదారుల ఎదురుచూపు

- ఇటీవల ఎంపిక చేసిన గ్రామాల్లో 2350 మందికే పంపిణీ
- పథకాలకు రేషన్‌కార్డే ప్రమాణికంగా తీసుకోవడంతో అర్హుల్లో ఆందోళన
- మార్పులు, చేర్పులకూ అవకాశం ఇవ్వని ప్రభుత్వం



భానుపురి (సూర్యాపేట) : రేషన్‌కార్డులు లేని నిరుపేదలకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వ పథకాలన్నింటికీ ఈ కార్డునే ప్రమాణికంగా తీసుకుంటున్నారు. దీంతో కార్డులేని వారు పథకాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. రేషన్‌కార్డు కోసం జిల్లా వ్యాప్తంగా కొత్తగా 1,03,798 మంది దరఖాస్తుచేసుకున్నారు. ఇటీవల ఎంపిక చేసిన గ్రామాల్లో 2,350 మందికి మాత్రమే కార్డులు పంపిణీ చేశారు. ఈనెల 1నుంచి ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో మిగిలినవారంతా కార్డు తమకెప్పుడొస్తుందోనని ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో రేషన్ కార్డులు	3,24,158
కొత్తగా వచ్చిన దరఖాస్తులు	1,03,798
ఎంపిక చేసిన గ్రామాల్లో ఇచ్చినవి	2,350

1,03,798 దరఖాస్తులు పెండింగ్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో రేషన్ కార్డుల కోసం ఎలాంటి దరఖాస్తులు తీసుకోలేదు. గత పదేళ్ల కాలంలో ప్రజలు వివిధ సందర్భాల్లో అందించిన వినతులనే పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో నూతన రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో 28వేల దరఖాస్తులు, మార్పులు, చేర్పుల నిమిత్తం 52వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది జనవరి 26వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల అమలుకు గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల సమయంలో అధికారులు చదివి వినిపించిన జాబితాలో తమ పేరు లేదని మరో 23,798 దరఖాస్తులు ప్రజల నుంచి అందాయి. ఇలా మొత్తం 1,03,798 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

యాక్టివేషన్ చేయడంలో ఆలస్యంతో..

జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 23 గ్రామాల్లో 2,350 మందికి రేషన్ కార్డులను అందించారు. వీరికి ఫిబ్రవరి నుంచే రేషన్ బియ్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా.. నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన సన్నబియ్యం పథకం సైతం అందలేదు. కార్డులను పంపిణీ చేసినా.. యాక్టివేషన్ చేయడంలో ఆలస్యం కావడంతో ఏప్రిల్ మాసంలో గ్రామానికి 10 నుంచి 12 మందికే సన్నబియ్యం వచ్చాయి. ప్రభుత్వం దరఖాస్తుదారులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వడంతో పాటు పాతకార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి



పదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు. కానీ ఇప్పటి వరకు రేషన్ కార్డు ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఎన్నోసార్లు దరఖాస్తులు అందించాను. ఇటీవల గ్రామసభలో మా పేరు చదివారు. అయినా ఇప్పటి వరకు కార్డు మంజూరు కాలేదు. అధికారులు కార్డు మంజూరు చేయాలి. రేషన్‌తో పాటు వివిధ పథకాలు అందడం లేదు.

– దేగల రాజు, ఆత్మకూర్ (ఎస్)

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితం

- అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పేదోడి సొంత ఇంటి కలను నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా ఇస్తుందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఎస్పీ నర్సింహతో కలిసి ఇసుక విధానంపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్లు జారీ చేసిన వేబిల్లులో సమయం, వాహనం నంబర్, ఫోన్ నంబర్, ఎక్కడ నుంచి ఎక్కడికి ఇసుక తరలిస్తున్నారో అన్ని వివరాలు నమోదు చేసిన తర్వాతనే అనుమతి ఇవ్వాలన్నారు. ప్రతి తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయంలో ఒక అధికారిని నియమించి ప్రతి వారం ఎన్ని అనుమతులు ఇచ్చారో సీ సెక్షన్‌కు నివేదిక సమర్పించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు, నీటి పారుదల శాఖకు మాత్రమే ఇసుక ఉచితంగా ఇస్తామని తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇతర జిల్లాలకు ఇసుక తరలిస్తే వాహనాలను బ్లాక్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. మొదటి సారి అక్రమ రవాణాలో వాహనం పట్టుపడితే కలెక్టర్ అనుమతితో రూ.5వేల జరిమానా, రూ.లక్షా బైండొవర్ విధించి వదిలి పెట్టాలని, రెండవసారి పట్టుపడితే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ అక్రమ రవాణాలో ఏమైనా వాహనాలు పట్టుపడితే గతంలో ఉన్న కేసుల వివరాలతో తహసీల్దార్లకు అప్పగించాలని సూచించారు. జాజిరెడ్డిగూడెం ఇసుక రీచ్ నుంచి మాత్రమే ఇరిగేషన్ శాఖకు అనుమతి ఉందన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ వేణుమాధవరావు, మైనింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలి

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని రోడ్లపై బ్లాక్ స్పాట్లను గుర్తించేందుకు రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోఎస్పీ నర్సింహతో కలిసి రోడ్ల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లా పరిధిలో ఎన్ హెచ్–65 పై 22 బ్లాక్ స్పాట్ లను గుర్తించామని, అక్కడ బ్లింకింగ్ లైట్స్, స్ట్రాంగ్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు, బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు లాంటి భద్రత ఏర్పాట్లు చేసి వాహనాల వేగం తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అధికారులకు సూచించారు. గతంలో ఎన్ హెచ్ 365లో పోలుమల్ల, ఎర్రప్రాడు క్రాస్ రోడ్డులో రెండు బ్లాక్ స్పాట్లు, ఎన్ హెచ్ 167 నేరేడుచర్ల నుంచి కోదాడ వరకు 8 బ్లాక్ స్పాట్లు గుర్తించినా.. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సంబంధిత ఏఈఈ లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 15 రోజుల్లో భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ వేణుమాధవరావు, డీటీఓ సురేష్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సీతారామయ్య, ఆబ్కారీ సూపరింటెండెంట్ లక్ష్మనాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈఓ అశోక్, డీఐఈఓ భాను నాయక్, ఆర్అండ్‌బీ డీఈలు పాల్గొన్నారు.

టెక్నీషియనే డాక్టర్‌గా చలామణి

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీల్లో వెలుగులోకి
- కేసు నమోదు



కార్డియాక్ సెంటర్ ఎదుట మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు

సూర్యాపేటటౌన్: స్కానింగ్ టెక్నీషియనే డాక్టర్ పేరు మీద రిపోర్ట్ ఇస్తున్న ఉదంతం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. జిల్లా కేంద్రంలో గల ఓ కార్డియాక్ సెంటర్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి. నరేష్‌కుమార్, డాక్టర్ ఎం. రాజీవ్ బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రిజిస్టర్ చేసుకున్న కార్డియాలజిస్ట్ లేకుండానే టెక్నీషియన్ తాను కూడా డాక్టర్ అని పేర్కొంటూ పేషెంట్లకు రిపోర్ట్ అందిస్తున్నట్లు గుర్తించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ లీలకృష్ణ పేరు మీద అనుమతి తీసుకున్నారని, కానీ డాక్టర్ లేకుండానే టెక్నీషియనే 2డీ ఈకో పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు పేర్కొన్నారు. డాక్టర్ లీలకృష్ణ, డాక్టర్ శిరీషకు నోటీసులు జారీ చేశామని, వారు తమ పేరు వినియోగించడానికి సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిన తర్వాత ఎథిక్స్ కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టర్ అని చెప్పుకుంటూ టెస్టులు నిర్వహిస్తున్న వనం శరత్‌చంద్రపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని డీఆర్‌డీఓ అప్పారావు సూచించారు. బుధవారం మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల, ముకుందాపురం గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న రైతులు ధాన్యంపై పట్టాలు కప్పుకొని తడవకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు నిర్వాహకులు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం గుమ్మడవెల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి, ఏపీఓ గుండు వెంకన్న, ఏపీఎం మైసయ్య, ఈసీ చారి, సీసీ రమేష్, నాగార్జున్‌రెడ్డి, వీఓఏలు బాలయ్య, సుమన్ ఉన్నారు.



ముకుందాపురంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ అప్పారావు

డిగ్రీ పరీక్షలు వాయిదా

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఈనెల 17 నుంచి మే 15 వరకు జరగాల్సిన డిగ్రీ పరీక్షలను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఓఈ) డాక్టర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని, తదుపరి పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



బరాఖత్‌గూడెంలోని కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మునగాల: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకువచ్చిన రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు కోరారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తున్నందున ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు. మునగాల మండలం బరాఖత్‌గూడెంలో మునగాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. కేంద్రానికి రోజూ ధాన్యం తీసుకువచ్చే రైతుల వివరాలను నిర్వాహకులు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. తేమశాతాన్ని పరిశీలించి నమోదు చేయాలని , ఏరోజు కాంటా వేసిన ధాన్యాన్ని అదేరోజు మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం రాశులపై తడవకుండా పట్టాలు కప్పి కాపాడుకోవాలని కోరారు. అంతకుముందు మునుగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యాన్ని, ఎస్సీ బాలికల వసతిగృహంలో వంట గదులు, సరుకులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, మునగాల, బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీల కార్యదర్శులు చంద్రశేఖర్, శ్వేత, ఏఈఓ రేష్మ, పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీఈఓ బసవయ్య, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి సుందరయ్య ఉన్నారు.

మామిడి రైతు కుదేలు

ఈదుగాలులు, వడగండ్ల వర్షానికి 3,092 ఎకరాల్లో నష్టం

- దీనికితోడు ప్రైవేట్ మార్కెట్‌లో ధర లేక దిగులు
- సైజు, మంగు పేరిట దళారుల కొర్రీలు
- టన్నుకు రూ.25వేల నుంచి రూ.30వేలకు కొనుగోలు





రెండు రోజుల కిందట వీచిన ఈదురుగాలులకు రాలిన మామిడి కాయలు, నేలకూలిన చెట్టు

కోదాడరూరల్ : ఈ ఏడాది మామిడి తోటల్లో సరైన పూత, కాత లేకపోవడంతో పాటు ఉన్న కొద్ది కాయలు ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి నేలరాలాయి. దీంతో జిల్లాలో 3,092 ఎకరాల్లో నష్టంవాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. దీనికి తోడు తోటల్లో ఉన్న కాస్త పంటలను అమ్ముకోవాలంటే ధరలేక దిగాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. డిసెంబర్, జనవరిలో పూత ప్రారంభమై ఫిబ్రవరి, మార్చి నుంచే దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది పూతే.. మార్చిలో వచ్చింది. అది కూడా సరిగా లేకపోవడంతో 20 నుంచి 30 శాతం మాత్రమే కాతకాసింది. అసలే కాత తక్కువ ఉంటే ఉన్న కొద్ది కాయలు కూడా వారం రోజులుగా వీస్తున్న ఈదురు గాలులు, వర్షాలకు రాలిపోయాయి.

1,730 మంది రైతులకు చెందిన..

జిల్లాలో 11,531 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి 1,730 మంది రైతులకు చెందిన 3,092 ఎకరాల్లోని మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగి పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

సన్నగిల్లుతున్న ఆశలు

సంవత్సరానికి ఓ సారి మాత్రమే వచ్చే మామిడి దిగుబడిపై రైతుల ఆశలు ఏటికేడు సన్నగిల్లుతున్నాయి. ఓ ఏడాది కాత ఉంటే ధర ఉండటం లేదు. మరో ఏడాది ధర ఉంటే కాత కాయడం లేదు. ఇంకో ఏడాది రెండు కూడా లేకుండా పోతున్నాయి, అదృష్టం బాగుండి కాత, దిగుబడి రెండు ఉన్నా ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలకు నష్టపోతున్నారు . దీంతో రైతులు మామిడి పంటపై నమ్మం కోల్పోతున్నారు. ఈ పంటలో మరో పంట సాగు చేయక పోవడంతో సంవత్సరం అంతా భూమిని ఖాళీగా ఉంచి ఈ ఏడాది అయినా లాభం రాకపోతదా అనే ఆశతో ఉంటే.. తీరా పంట చేతికొచ్చే సమయానికి ఏదో విధంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోయిన కౌలు రైతులు

మామిడి కౌలురైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది వరకు ఎకరాకు రూ.40వేల వరకు కౌలు ఉంది. ఈ ఏడాది మాత్రం చెట్టు సంవత్సరాలను బట్టి రూ.50వేల నుంచి రూ. 60 వేల వరకు పెంచారు. దీంతో పెట్టుబడి ఎకరాకు రూ.40 వేల నుంచి 50వేల వరకు పెట్టారు. కౌలు రైతు ఎకరాకు దాదాపు రూ. లక్షవరకు పెట్టుబడుతులు పెట్టాడు. ఉన్న కొద్ది కాయలు కూడా గాలి దుమారానికి రాలడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని కౌలు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటల బీమాపై రైతులకు అవగాహన ఉండడంలేదు. ఒక వేళ అవగాహన ఉన్న రైతులు వేల రూపాయలు బీమా కట్టినా పంట నష్టపోయినప్పుడు పరిహారం రావడంలేదు. దీంతో బీమా చెల్లించడానికి మామిడి రైతులెవరూ ముందుకు రావడంలేదు.

కొర్రీలు పెట్టి.. ధర తగ్గించి..

మామిడి రైతులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడికి వచ్చిన మామిడికాయలకు ఏదో ఒక రైతుకు మాత్రమే టన్నుకు రూ.50 వేల ధర చెల్లించి మిగిలినవారి కాయలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలకు దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే కాయ సైజు లేదు, మంగు ఉంది అంటూ పలు రకాల కొర్రీలు పెడుతూ సరైన ధర చెల్లించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు తీసుకెళ్లిన కాయలు ఇంటికి తేలేక అక్కడే వచ్చిన రేటుకు రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పదేళ్ల నుంచి మామిడిని కౌలుకి తీసుకొని సాగుచేస్తున్న. ఈ ఏడాది 35 ఎకరాలు తీసుకొని రూ.30లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పూత సమయంలో తేనెమంచు తెగులు రావడంతో సరిగా కాత కాయలేదు. ఉన్న కాయ గాలిదుమారానికి రాలింది. ఇతర రాష్ట్రాల్లో టన్ను రూ.50వేలు ఉంటే మన దగ్గర దళారులు టన్ను రూ.20వేల నుంచి రూ.30వేలకు మించి పెట్టడం లేదు. ఈ ఏడాది రూ.15లక్షల వరకు నష్టం మిగలనుంది. గ్రామాల్లో అధికారులు సర్వే చేసి తోటలను కౌలుకు తీసుకున్న రైతులను గుర్తించి వారికే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

–బాలెబోయిన రాజుగౌడ్, కాపుగల్లు, కౌలు రైతు

పూత, కాతలేక నష్టం



15 ఎకరాల్లో మామిడితోట సాగు చేస్తున్నాను. ప్రతి ఏడాది ఏదో విధంగా దిగుబడిలేక, ఉన్నా రేటు రాక నష్టపోతున్నా. అసలు ఈ ఏడాది పూత, కాత లేక వైరస్‌తో తీవ్రంగా నష్టం జరిగింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి. ఇక మామిడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

–ఇర్ల సీతరాంరెడ్డి, గణపవరం, రైతు

క్లుప్తంగా

యాసిడ్ దాడి చేసిన వ్యక్తికి 20ఏళ్లు జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): మహిళను వేధింపులకు గురిచేసి ఆమెపై యాసిడ్‌తో దాడి చేసిన వ్యక్తికి 20ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ రెండో అదనపు కోర్టు జడ్జి ఎన్. రోజారమణి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండల పరిధిలోని దామెర గ్రామానికి చెందిన బచ్చనబోయిన మహేష్ అదే గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళ వేధింపులకు గురిచేస్తూ 2018 అక్టోబర్ 13న ఆమెపై యాసిడ్‌తో దాడి చంపేందుకు యత్నించాడు. ఈ దాడి తప్పించుకున్న సదరు మహిళ మరుసటిరోజు నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో మహేష్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. అఖిల వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ రెండో అదనపు కోర్టు జడ్జి ఎన్. రోజారమణి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు(ఎం): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నరేందర్‌రెడ్డి(35)కి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. అతడికి నాలుగు నెలల వయస్సున్న కుమారుడు ఉన్నాడు. నరేందర్‌రెడ్డి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉగాది పండుగ రోజు బైక్‌పై వెళ్తూ హైదరాబాద్‌లోని రావిరాల వద్ద అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోనే ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. నరేందర్‌రెడ్డిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తుల ఆర్థికసాయంతో బుధవారం స్వగ్రామం పోతిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బీబీనగర్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని బీబీనగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రం నగౌర్ జిల్లా దేహ గ్రామానికి చెందిన మోయినుద్దీన్ బీబీనగర్ మండలం జమీలాపేట గ్రామంలో నివాసముంటున్నాడు. రాజస్తాన్‌లో అనిల్ అనే వ్యక్తి నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో మార్చి బీబీనగర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ నెల 13న అనిల్ నుంచి 900గ్రాముల గంజాయి కొనుగోలు చేశాడు. 15వ తేదీ రాత్రి మోయినుద్దీన్ నెమురగొముల గ్రామం నుంచి జమీలాపేట వైపు బైక్‌పై వెళ్తుండగా.. జమీలాపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి మోయినుద్దీన్ పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు గమనించి అతడిని పట్టుకొనగా.. అతడి వద్ద 900గ్రాముల గంజాయి దొరికింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తమ్ముడి మామే సూత్రధారి

- తన కుమార్తె సంసారం నాశనం చేశాడనే కక్షతో గద్దపాటి సురేష్‌ను హత్య చేయించిన అతడి తమ్ముడి మామ
- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నిందితులు వాడిన కారు, ద్విచక్ర వాహనాలు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన మణికంఠ కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు పాల్పడిన నలుగురికి బుధవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం రాత్రి తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. నకిరేకల్‌కు చెందిన గద్దపాటి సురేష్ నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో మణికంఠ కలర్ ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. సురేష్ తమ్ముడు నరేష్‌కు 2017లో హైదరాబాద్‌కు చెందిన మాతరి వెంకటయ్య కుమార్తె ఉమామహేశ్వరితో వివాహమైంది. కొన్నాళ్ల వరకు నరేష్ సంసారం సాఫీగానే సాగినప్పటికీ ఆ తర్వాత అతడు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తన భార్యను దూరంగా ఉంచడంతో పాటు ఆమెను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశాడు. భార్యాభర్తల మధ్య గొడవలపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. అయితే తన కుమార్తె సంసారం నాశనం కావడానికి తన అల్లుడైన నరేష్ అన్న సురేషే కారణమని మాతరి వెంకటయ్య భావించాడు. సురేష్ కూడా వేరే మహిళతో చాలాకాలంగా సాన్నిహిత్యంగా ఉంటూ తన భార్యకు దూరంగా ఉంటున్నాడని తెలియడంతో పాటు నరేష్ వివాహేతర సంబంధాన్ని సురేష్ ప్రోత్సహిస్తున్నాడని నమ్మిన మాతరి వెంకటయ్య ఎలాగైనా సురేష్‌ను అంతమొందిస్తే తన అల్లుడు నరేష్‌కు బుద్ధి వచ్చి తన కుమార్తెతో మంచిగా ఉంటాడని భావించాడు.

సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం..

ఈ మేరకు మాతరి వెంకటయ్య హైదరాబాద్‌లోని కొత్తపేటకు చెందిన స్కాట్ డిటెక్టివ్ ఏజెన్సీకి చెందిన చిక్కు కిరణ్‌కుమార్ అలియాస్ సీకే కిరణ్‌కుమార్‌ను సంప్రదించి అతడి ద్వారా తన అల్లుడు నరేష్‌పై నిఘా పెట్టించాడు. ఆరు నెలల నుంచి నిఘా పెట్టగా.. తన అల్లుడు నరేష్ మరో మహిళతో సహజీవనం చేస్తూ ఒక పాపను కూడా కన్నాడని తెలిసింది. సురేష్ ప్రోత్సాహంతోనే నరేష్ ఇదంతా చేశాడని నమ్మిన వెంకటయ్య, అతడి కుమార్తె ఉమామహేశ్వరి సురేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని స్కాట్ డిటెక్టివ్ ఏజెన్సీకి చెందిన కిరణ్‌కుమార్‌కు చెప్పగా.. తాను గతంలో నేవీలో కమ్యూనికేషన్ వింగ్‌లో పనిచేశానని, ఆధారాలు దొరకకుండా హత్య ఎలా చేయాలో తనకు బాగా తెలుసని, రూ.15 లక్షలు ఇస్తే హత్య చేస్తానని కిరణ్‌కుమార్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈ క్రమంలో కిరణ్‌కుమార్ నెల క్రితం కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామానికి చెందిన తన బంధువు ముశం జగదీశ్‌కు విషయం చెప్పి, రూ.3 లక్షలు పారితోషికం ఇస్తానని ఆశచూపి ఈ హత్యలో భాగస్వామి కావాలని కోరాడు. దీంతో జగదీశ్ ఒప్పుకున్నాడు. వీరిద్దరు కలిసి నెల రోజుల నుంచి నల్లగొండ పట్టణంలో రెక్కీ నిర్వహిస్తూ గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో మణికంఠ కలర్ ల్యాబ్ నిర్వహిస్తున్న సురేష్ కదలికలను కనిపెడుతూ వచ్చారు.

హత్య జరిగింది ఇలా..

నెల రోజులు రెక్కీఅనంతరం ఈ నెల 11న చిక్కు కిరణ్‌కుమార్ హైదరాబాద్ నుంచి జెన్ కారులో చెర్వుగట్టు వరకు వచ్చాడు. హత్య చేయడానికి కావల్సిన కత్తులు, మాస్కులు, టోపీలు, గ్లౌజ్‌లను వెంట తెచ్చుకున్నాడు. కారు చెర్వుగట్టు వద్ద పెట్టిన కిరణ్‌కుమార్ అప్పటికే అక్కడ వేచి ఉన్న ముశం జగదీశ్‌తో కలిసి బైక్‌పై చర్లపల్లి వరకు వచ్చారు. అక్కడ నుంచి ఆటోలో రాత్రి 10 గంటలకు రామగిరి చేరుకున్నారు. అక్కడి నుంచి గీతాంజలి అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకుని పథకం ప్రకారం మృతుడి షాపు వెనకాల అప్పటికే ఉంచిన బైక్ తీసుకుని 10.45గంటలకు కలర్ ల్యాబ్ వద్దకు వచ్చారు. తమకు ఫొటోలు, ప్రింట్లు కావాలని సురేష్‌ను అడగ్గా.. రాత్రయింది రేపు ఉదయం రమ్మని సురేష్ వారికి చెప్పాడు. అర్జెంటుగా కావాలని అడగడంతో ఫొటోలు ప్రింట్ ఇచ్చే పనిలో సురేష్ నిమగ్నమవ్వగా.. అదే అదునుగా భావించిన కిరణ్‌కుమార్, జగదీశ్ కత్తులతో సురేష్ గొంతు కోసి వీపు, పొట్ట భాగంలో విచక్షణారహితంగా పొడిచారు. అనంతరం బైక్‌పై చర్లపల్లి వరకు వెళ్లి అక్కడ నుంచి మరో బైక్‌పై చెర్వుగట్టుకు వెళ్లి అక్కడ రక్తం అంటిన దుస్తులు, కత్తులు అన్నీ కారులో పెట్టుకుని అమ్మనబోలు వైపు వెళ్లిపోయారు. మార్గమధ్యలో మూసీ వాగులో రక్తం అంటిన దుస్తులు, కత్తులను పడేసి హైదరాబాద్ పారిపోయారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నల్లగొండ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ శివరాంరెడ్డి నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా.. బుధవారం హత్యకు పథకం వేసిన నరేష్ మామ మాతరి వెంకటయ్య(ఏ1), అతడి కూతురు, నరేష్ భార్య గద్దపాటి ఉమామహేశ్వరి(ఏ4)ని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. చిక్కు కిరణ్‌కుమార్(ఏ2), ముశం జగదీశ్(ఏ3)ను నార్కట్‌పల్లిలో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి మారుతీ జెన్ కారు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు ఛేదించిన డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సైదులును ఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి ఆ తర్వాత పోలీస్ కస్టడీకి తీసుకుని తదుపరి విచారణ చేస్తామని ఎస్పీ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన పోరాటం చేయాలని, పనిచేసే నాయకులకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణ యుగమని, కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారని అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, రాచకొండ క్రిష్ణయ్య, సుంకరి యాదగిరిగౌడ్, కూరెళ్ల లింగస్వామి, కొలను వెంకటేష్‌గౌడ్, మెండె సైదులు, కందాటి రమేష్‌రెడ్డి, జిట్ట బోందయ్య, కోనేటి ఎల్లయ్య, పోల్లేపల్లి సత్యనారాయణ, మర్రి జలంధర్‌రెడ్డి, పోకల రాములు, ఆవుల ఆనంద్, కునూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


చలపతిరావు (ఫైల్)

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా గన్నవరం మండలం బుద్ధవరం గ్రామానికి చెందిన పందేటి చలపతిరావు(38) చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో గల దివీస్ ఫార్మా కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గత 20 ఏళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. మంగళవారం సాయంత్రి చలపతిరావు భార్య భవిత ప్రార్థన నిమిత్తం స్థానికంగా చర్చికి వెళ్లింది. కుమార్తె ఇంట్లోనే ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తితో చలపతిరావు రాత్రి 8గంటల సమయంలో ఇంట్లోని మరో గదికి వెళ్లి సీలింగ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రార్థన ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన భవిత తన భర్త ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసి బోరున విలపించింది. మృతుడి తండ్రి వీరరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆస్తి వివాదం.. వ్యక్తిపై కత్తులతో దాడి

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం జరిగిన ఓ వివాహ వేడుకలో వ్యక్తిపై మరో ముగ్గురు కత్తులతో దాడి జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొడిచేడు గ్రామానికి చెందిన నర్ర నరసింహులు తన కుమార్తె, అల్లుడు స్వరూప, చంద్రయ్య దంపతులు మృతిచెందిన తర్వాత వారి పిల్లలు శ్రావణి, శివను స్వయంగా పెంచి పోషిస్తున్నాడు. ఆయనకు ఆరెగూడెం గ్రామ పరిధిలో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. శ్రావణి మూడు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన ఏనుగు మహేందర్ అనే యువకుడిని ప్రేమించి వివాహం చేసుకుంది. దీంతో నరసింహులు, మహేందర్ మధ్య ఆస్తి వివాదం తలెత్తింది. ఈ వ్యవహారంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, నరసింహులు ఒక ఎకరా భూమిని మహేందర్‌కు ఇవ్వడానికి అంగీకరించాడు. మిగిలిన భూమిని కూడా స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశంతో ఏనుగు మహేందర్, అతడి అనుచరులు ఏనుగు మధు, కప్ప సైదులు కలిసి మోత్కూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకకు హాజరైన నరసింహులుపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నరసింహులును భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికురాలు మృతి

బొమ్మలరామారం: విద్యుదాఘాతంతో వలస కార్మికురాలు మృతి చెందింది. ఈ ఘటన బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. మర్యాల గ్రామ శివారులో ధీరావత్ రవికి చెందిన ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రం మురిబాహల్ గ్రామానికి చెందిన శోభన్ మాజీ, భానుమతి దంపతులు పనిచేస్తున్నారు. వారు ఇటుక బట్టీ వద్ద ఏర్పాటు చేసుకున్న నివాసంపై ఉన్న రేకులపై మంగళవారం రాత్రి వీచిన గాలి దుమారానికి విద్యుత్ వైరు తెగిపడింది. బుధవారం ఉదయం పనులు చేసేందుకు భానుమతి తన నివాసం నుంచి బయటకు రాగా.. ఆమె తలకు రేకులు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త శోభన్ మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

51కిలోల గంజాయి పట్టివేత


గంజాయి పట్టుకున్న పోలీసులు

భువనగిరిటౌన్: ఏపీలోని చిత్తూరు నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు తరలిస్తున్న రూ.14.50 లక్షల విలువైన 51.13 కిలోల గంజాయిని బుధవారం భువనగిరిలో పట్టుకున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... ఎస్ఐ కుమారస్వామి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ శివారులోని వైట్ స్టోన్ వెంచర్ వద్ద జగదేవ్‌పూర్ రోడ్డులో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 51.13 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న సంగారెడ్డి జిల్లా ఈశన్నపురం గ్రామానికి చెందిన మహమ్మద్ అమీర్, సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన డ్రైవర్ మొహమ్మద్ ఇస్మాయిల్, అదే ప్రాంతానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు మహమ్మద్ ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుర్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో నిందితుడు హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన బాషా పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి


ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. బుధవారం ఎంజీయూలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రాంక్లిన్ టెక్ సిస్టమ్స్ కంపెనీ సహకారంతో ఐటీ, నాన్‌ఐటీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ సెక్టార్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 250మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయంతి, సుధారాణి, నాగరాజు, సత్యనారాయణరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి కూలీల ఆటో బోల్తా

- మహిళా కూలీ మృతి
- పలువురికి గాయాలు


యాదమ్మ (ఫైల్)

ఆత్మకూర్(ఎస్): మహిళా కూలీలతో వెళ్తున్న ఆటో కుక్కను తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక కూలీ మృతిచెందగా.. పలువురికి తీవ్ర తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట రూరల్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన పది మంది మహిళలు అదే గ్రామానికి చెందిన కేశరాజుపల్లి శంకర్ ఆటోలో ఆత్మకూర్(ఎస్) మండలం శెట్టిగూడెంలో మిరప తోట ఏరడానికి బుదవారం తెల్లవారుజామున బయల్దేరారు. ఉదయం 4:30 సమయంలో కోటపహాడ్ గ్రామ పంచాయతీ సమీపంలో ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ కుక్కను తప్పించబోగా.. అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మాదరబోయిన యాదమ్మ(50) అక్కడికక్కడే మృతిచెందింది. మిగతా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో గాయపడిన వారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. యాదమ్మ మృతదేహానికి సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతురాలి కుమారుడు లింగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

చౌటుప్పల్: ఏపీ నుంచి బొలేరో వాహనంలో అక్రమంగా గోవులను తరలిస్తుండగా బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా తుని పట్టణ కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌రావు ఏలూరు సంతలో కొనుగోలు చేసిన నాలుగు ఆవులు, ఏడు ఎద్దులను అక్రమంగా బొలేరో వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. బొలేరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు, పట్టుబడిన ఆవులు, ఎద్దులను గోశాలకు తరలించారు. బొలేరో వాహనం డ్రైవర్ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో రోగి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- గుండెపోటుతో చనిపోయి ఉండవచ్చన్న సూపరింటెండెంట్


క్రిష్ణయ్య (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతూ రెండు రోజుల క్రితం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చేరిన రోగి బుధవారం మృతిచెందాడు. అయితే ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందాడని ఆరోపిస్తూ బుధవారం ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల పరిధిలోని బొర్రాయిపాలెం గ్రామానికి చెందిన మొండికత్తి క్రిష్ణయ్య(70) గత కొంతకాలంగా మోకాళ్లు, కీళ్ల నొప్పులు బాధపడుతున్నాడు. దీంతో ఈ నెల 14వ తేదీన అతడిని కుటుంబ సభ్యులు మిర్యాలగూడలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. క్రిష్ణయ్యను పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. బుధవారం ఉదయం క్రిష్ణయ్యకు ఆస్పత్రి సిబ్బంది సెలైన్ బాటిల్ పెట్టి ఓ ఇంజక్షన్ ఇవ్వగా.. అతడి నోటి వెంట నురగ రావడంతో పాటు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన ఆస్పత్రి సిబ్బంది సీపీఆర్ చేసి పరీక్షించగా అప్పటికే అతడు మృతిచెందాడు. దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే క్రిష్ణయ్య మృతిచెందాడని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి వద్దకు చేరుకుని మృతుడి బంధువులతో మాట్లాడారు. ఈ ఘటనపై మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరథ్‌ను వివరణ కోరగా.. ఇంజక్షన్ వికటించి క్రిష్ణయ్య మృతిచెందలేదని, ఇందులో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఏమీ లేదని తెలిపారు. క్రిష్ణయ్య గుండెపోటు వచ్చి మృతిచెంది ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఉరేసుకుని మహిళ బలవన్మరణం

తిప్పర్తి: తిప్పర్తి మండలం రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని యర్రగంట్లగూడెం గ్రామానికి నక్క రమణ(32) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రమణ మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి ఆత్మహత్య..

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్కకు చెందిన కత్తుల మాధురి(26) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాన్యంచెల్కకు చెందిన కత్తుల రూప పట్టణంలో వంట పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం 6గంటలకు రూప వంట పనికి వెళ్లగా.. ఆమె చిన్న కుమార్తె మాధురి ఇంట్లో ఒంటరిగా ఉంది. రూప సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చేసరికి మాధురి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. కాగా.. మాధురికి కొన్నిరోజుల క్రితమే వివాహం నిశ్చయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆరేళ్ల చిన్నారికి బ్రెయిన్ క్యాన్సర్

- సొంత ఇల్లు అమ్మి, అప్పులు చేసి కీమోథెరపీ చేయిస్తున్న తల్లిదండ్రులు
- ఇప్పటివరకు రూ.40లక్షలకు పైగా అయిన వైద్యం ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


ప్రసన్నకు పాలు తాగిస్తున్న తల్లి అనిత

మునుగోడు: తోటి పిల్లలతో కలిసి బడికి పోవాల్సిన ఆరేళ్ల చిన్నారి బ్రెయిన్ క్యాన్సర్ బారిన పడింది. ఎలాగైనా తమ కుమార్తెను కాపాడుకోవడానికి ఆమె తల్లిదండ్రులు ఇల్లు అమ్మి, అప్పులు చేసి కీమోథెరపీ చేయిస్తున్నారు. ప్రస్తుతం వారి చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలు.. మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన పగిడిమర్రి మహేష్, అనిత దంపతులకు 2016లో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె ప్రసన్న 2019లో జన్మించింది. 2023లో ప్రసన్న అనారోగ్యానికి గురికావడంతో అప్పటి నుంచి ఆ చిన్నారిని అనేక ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించినా ఆమెకు వచ్చిన జబ్బు ఏమిటో ఏ డాక్టర్ గుర్తించలేకపోయారు. ఆరు నెలల క్రితం ఆ చిన్నారి బ్రెయిన్‌లో ట్యూమర్ ఉందని వైద్యులు తేల్చారు. దీనికి తోడు బ్రెయిన్ క్యాన్సర్ కూడా ఉందని చెప్పారు.

ఆస్తులు అమ్మి వైద్యం చేయిస్తున్న తల్లిదండ్రులు..

మహేష్ వండ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి స్వగ్రామంలో ఎలాంటి వ్యవసాయ భూమి, ఆస్తులు లేవు. బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లి తన అన్నదమ్ములతో కలసి ఉంటూ అక్కడే పనిచేసి ఓ ఇల్లు కొనుక్కున్నాడు. కుమార్తె అనారోగ్యానికి గురికావడంతో ఆ ఇంటిని రూ.23 లక్షలకు విక్రయించి ఆమెకు హైదరాబాద్‌లో కీమోథెరపీ చేయిస్తున్నాడు. అంతేకాకుండా తన వద్ద ఉన్న వస్తువులు రవాణా చేసే రెండు వాహనాలను కూడా విక్రయించినా తన కుమార్తె వైద్యానికి డబ్బులు సరిపోకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద అప్పు చేశాడు. ఇప్పటి వరకు రూ.40లక్షల వరకు ప్రసన్న వైద్యం కోసం ఖర్చు చేశాడు.

రేషన్ కార్డు లేకపోవడంతో ఆర్థిక భారం..

మహేష్, అనిత దంపతులు 2018లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ అప్పటి నుంచి నూతన రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో వారికి నేటికీ రేషన్ కార్డు మంజూరు కాలేదు. దీంతో వారి కుమార్తెకు ఏ ఆస్పత్రిలో కూడా ఉచిత వైద్యం అందడం లేదు. కనీసం తమ చిన్నారికి అవసరమైన రక్తం కూడా వేల రూపాయలు పెట్టి కొనాల్సి వస్తుందని వాపోతున్నారు. తమకు రేషన్ కార్డు ఉంటే వైద్య ఖర్చుల భారం సగానికి పైగా తగ్గేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తమపై దయతలచి తమ చిన్నారిని కాపాడుకునేందుకు నూతన రేషన్ కార్డు మంజూరు చేయడంతో పాటు వైద్య ఖర్చులకు దాతలు సహాయం అందించాలని వేడుకుంటున్నారు.

కన్నీటి గాథ

మా పాపకు ప్రాణదానం చేయండి

మాది నిరుపేద కుటుంబం. మా పెద్ద పాపకి బ్రెయిన్ క్యాన్సర్ రావడంతో ఉన్న ఇంటిని అమ్మి వైద్యం చేయించాం. అయినా నయం కాలేదు. మా దగ్గర ఖర్చు చేయడానికి పైసలు లేవు. ఎవరైనా దాతలు మాకు సహాయం అందించి మా పాప ప్రాణం కాపాడండి. మాకు రేషన్‌కార్డు లేకపోవడంతో ఎక్కడా ఉచిత వైద్యం పొందలేకపోతున్నాం. మాపై దయతలచి అధికారులు రేషన్‌కార్డు మంజూరు చేయాలని వేడుకుంటున్నా.

– అనిత, ప్రసన్న తల్లి